వేగంగా రహదారుల నిర్మాణం

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

- పలు రోడ్ల ఆధునికీకరణకూ నిధులు
- మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ



నిర్మాణం పూర్తి చేసుకున్న మొగళ్లూరు సీసీరోడ్డు

పొదలకూరు : మండల పరిధిలో గ్రామీణ రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అంతే కాకుండా సుదీర్ఘ కాలంగా ఆధునికీకరణకు నోచుకోని రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని రూ.కోట్లాది నిధులను రహదారుల నిర్మాణానికి మంజూరు చేయించారు. ఫలితంగా గ్రామీణ రోడ్లతో పాటు పొదలకూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులకు నిధులు మంజూరై పనులను పూర్తి చేశారు. గత ప్రభుత్వాలు గ్రామీణ రహదారులను గాలికి వదిలేస్తే ఈ ప్రభుత్వంలో పార్లపల్లి, నల్లపాళెం, ఇనుకుర్తి, పొడమేకల కండ్రిక తదితర గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ రోడ్లను మంత్రి కాకాణి ప్రారంభించారు. కనుపర్తి బ్రాంచి రోడ్డు పనులు కూడా వేగం అందుకున్నాయి.



పనులు జరుగుతున్న కనుపర్తి బ్రాంచిరోడ్డు



పూర్తయిన తోడేరు తోరురోడ్డు

రోడ్ల నిర్మాణానికి రూ.కోట్ల మంజూరు

మండలంలోని మొగళ్లూరు, బిరదవోలు గ్రామీణ రహదారులకు మొత్తం రూ.3.73 కోట్లు మంజూరై చక్కటి రోడ్లను నిర్మించారు. ఈ రెండు రహదారులు అతిముఖ్యమైనవిగా ఆయా గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. బిరదవోలు రోడ్డు రూ.3.1 కి.మీ దూరంతో పూర్తి కావడం వల్ల మనుబోలు, సైదాపురం మండలాల గ్రామాలకు సైతం ఎంతగానో ఉపయోగపడుతోంది. మొగళ్లూరు రోడ్డుతో పాటు కనుపర్తి, అమ్మవారిపాళెం, అయ్యగారిపాళెం, తోడేరు, కొనగలూరు, గురవాయపాళెం, చిట్టేపల్లి గ్రామీణరోడ్ల కోసం మార్కెటింగ్‌శాఖ నుంచి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటిలో మొగళ్లూరు, తోడేరు, అయ్యగారిపాళెం, అమ్మవారిపాళెం, కొనగలూరు రోడ్లు పూర్తవగా మిగిలిన పనులు జరుగుతున్నాయి.

ప్రధాన రహదారులకు..

పొదలకూరు–సోమశిల, పొదలకూరు–సంగం, పొదలకూరు–మనుబోలు మార్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి మంత్రి కాకాణి చొరవతో రూ.13.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటితో రహదారుల ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. అంతే కాకుండా మండలంలోని నావూరు రోడ్డు మీదుగా అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామాలు ఉన్నాయి. ఈ రహదారి బాగా దెబ్బతిని ఉండడంతో నావూరు రోడ్డు ఆధునికీకరణకు రూ.10.83 కోట్లు, నావూరు రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.62 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలో రోడ్డు పనులను పూర్తి చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. పొదలకూరు పట్టణంలో సిమెంటురోడ్డు, ఇనుకుర్తి వద్ద తారురోడ్డు నిర్మాణం రూ.5 కోట్లతో పూర్తి చేశారు. సిమెంటు రోడ్డు నిర్మాణంతో పట్టణానికే కళ వచ్చింది.

వివిధ దశల్లో..

- రూ.5 కోట్లతో పట్టణ మెయిన్ రోడ్డుకు మహర్దశ
- రూ.3.73 కోట్లతో మొగళ్లూరు, బిరదవోలు రోడ్ల నిర్మాణం
- రూ.13.50 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణం
- నావూరు రోడ్డుకు నిధుల మంజూరు
- నిర్మాణంలో కనుపర్తి బ్రాంచి రోడ్డు

త్వరితగతిన పనులు

మండలంలో మిగిలిన రోడ్లను కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం. కనుపర్తి రోడ్డు నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఏఎంసీ నిధులతో గ్రామీణరోడ్ల నిర్మాణం చాలావరకు పూర్తి చేశాం. – మవేక్‌రెడ్డి, పీఆర్ ఏఈ

క్లుప్తంగా

మంత్రి కాకాణి పరామర్శ



రమణయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మన్నారపు రమణయ్య(65) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పాలిచెర్లపాడుకు వెళ్లి రమణయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

కులగణనకు సహకరించాలి

- ఈఓపీఆర్డీ డేవిడ్



కులగణనను పరిశీలించి సూచనలు చేస్తున్న ఈఓపీఆర్డీ

కొడవలూరు: ప్రతిఒక్కరూ కులగణనకు సహకరించాలని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ కోరారు. కొడవలూరులో జరుగుతున్న కులగణనను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులాల వారీగా జనసంఖ్యను తెలుసుకోవడం ద్వారా ఆ మేరకు ప్రభుత్వ పథకాలందించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఎంతో ఉపయోగకరమైన కులగణనకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఈనెల 28వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతున్నందున ఈలోపు ఇంటి వద్ద లేని వారు కూడా వచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలకు వినతి

నెల్లూరు(టౌన్): వెంకటాచలం మండలం నాయడుపాళెంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేవూరి సుబ్బారావు వృత్తిని వదిలేసి విధులకు హాజరుకాకుండా కులసంఘాన్ని భుజాలపై పెట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయనపై చర్యలు చేపట్టాలని కోరారు.

నిరుపేద బ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం

నెల్లూరు(బృందావనం): నిరుపేద బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా యునైటెడ్ బ్రాహ్మణ ఫోరం(యూబీఎఫ్)ను ఏర్పాటు చేశామని సంస్థ నిర్వాహకుడు రామచంద్రరావు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని కురువాడ లలితమ్మ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన యూబీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని నిరుపేద, మధ్యతరగతి బ్రాహ్మణులు అపరకర్మల నిర్వహణలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వీరి కోసం రూ.25 లక్షల విలువైన స్థలాన్ని హైదరాబాద్‌కు చెందిన వరుఘల ఉమామహేశ్వరరావు విరాళంగా అందజేశారని చెప్పారు. ఆ స్థలంలో అపరకర్మల నిర్వహణకు భవన నిర్మాణాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. ప్రవీణ్, పవని నాగేంద్రప్రసాద్, శ్రీశైలం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చిత్రరంగ అభివృద్ధికి కృషి



ఏఎం రత్నంకు సత్కారం

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో చిత్రరంగ అభివృద్ధికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఏఎం రత్నాన్ని కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చిత్ర రంగాన్ని అభివృద్ధి చేసేందుకు గానూ ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. దీని బలోపేతానికి గానూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చిత్రరంగ పరిశ్రమతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కవులు, కళాకారులు, రచయితలు, నటీనటులకు నెల్లూరు పుట్టినిల్లన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం కళాకారులు ఉన్నతంగా ఎదగాలని కాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కన్వీనర్‌గా కళాంజలి అనంత్‌ను నియమిస్తున్నామని ప్రకటించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నెల్లూరుకు చెందిన సుధీర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో న్యూరో, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలను ఉచితంగా అందించారు. బీపీ, షుగర్, ఈసీజీ, కేన్సర్ స్క్రీనింగ్ సేవలను కూడా అందించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, తోటపల్లి, కామాక్షినగర్, డక్కులవారిపాళెం గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రోగులు ఉచిత వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధీరజ్, నాగమాణిక్యం తదితరులు పాల్గొని రోగులకు వైద్య సేవలను అందించారు.

నేడు ఆర్‌వైపాళేనికి మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని ఆర్‌వైపాళెం గ్రామానికి వస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు



భక్తులకు అన్నప్రసాద వితరణ

మనుబోలు : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం(విష్ణాలయం)లో ఆదివారం ఏకాదశి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామివారికి అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సుప్రభాత సేవ, తిరుప్పావై చేసి వేద మంత్రోచ్చారణల మధ్య భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద 300 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు బొమ్మిరెడ్డి శంకర్‌రెడ్డి, అనసూయమ్మ, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, జానకి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉభయకర్తలకు అర్చకుడు వేద ఆశీర్వాచనాలు అందజేశారు.

కామాక్షితాయి సేవలో..



విక్రమ్‌సింహాకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ జి.విక్రమ్‌సింహా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది అతిథిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

రూరల్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడిగా చెంచయ్య

పొదలకూరు : రూరల్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా పొదలకూరు పట్టణానికి చెందిన ఆమర్తలూరు చెంచయ్యను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ముత్తుకూరు మండలానికి చెందిన చెందా వెంకటస్వామి, కోశాధికారిగా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన టి.ఆదినారాయణ, అదనపు కార్యదర్శిగా పొదలకూరు పట్టణానికి చెందిన పొట్టి సుధాకర్‌ను నియమించినట్లు వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఓ వ్యక్తి తన ఇంట్లో మృతి చెందారు. మృతదేహం కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో మృతుడి బంధువులు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని బెస్తవారిపాళెనికి చెందిన సురేష్‌రెడ్డి (55) అవివాహితుడు. ఎలక్ట్రీషియన్ పనులు, జ్యోతిష్యం చెప్తూ ఒంటరిగా ఉంటున్నారు. ఇంటి నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు మూలాపేటలో నివాసం ఉంటున్న అతని సోదరుడి కుమారుడు అయ్యప్పరెడ్డి, చిన్నబజార్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపులను పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, సురేష్‌రెడ్డి మృతి చెంది ఉన్నారు. సురేష్‌రెడ్డి మృతి చెంది మూడు, నాలుగు రోజులై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అయ్యప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చిన్నబజార్ ఎస్సై సైదులు తెలిపారు. అనారోగ్యమే మృతికి కారణమని తెలిపారు.

ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురంలోని జెడ్పీ హైస్కూల్లో రక్తదాన శిబిరాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రక్తాన్ని రెడ్‌క్రాస్, నోవా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్‌ను సత్కరించారు.

సూరా శ్రీనివాసులురెడ్డిపై సస్పెన్షన్ వేటు

కోవూరు : వవ్వేరు బ్యాంక్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత సూరా శ్రీనివాసులురెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడన్న కారణంతో సూరా శ్రీనివాసులురెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



క్రికెట్ కిట్లు అందుకున్న క్రీడాకారులతో అధికారులు, నాయకులు

కోవూరు: 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల విజేతలకు క్రీడా పరికరాల కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ స్థాయిలో యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో కోవూరు క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందని, దానిని మరింత మెరుగులు దిద్దేలా క్రీడాకారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎంపీపీ పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈఓ రహీమ్, ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నేడు



మాట్లాడుతున్న దేవస్థాన చైర్మన్ కృష్ణారెడ్డి

కోవూరు: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో కోవూరులోని గాంధీ పార్క్ ప్రాంతంలో ఉన్న కోదండరామస్వామి దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థాన చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. దేవస్థానం ఆవరణలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని, వీటితో పాటు కోలాట కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతే కాకుండా అయోధ్యలో జరిగే కార్యక్రమాలను ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేసి భక్తులు వీక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం స్వామివారి ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాంతాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటేశ్వర్లురెడ్డి, సాయిసందీప్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో వార్షిక ప్రతిష్ఠా దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. కేరళ సంప్రదాయం ప్రకారం మకర మాస రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వామికి మహాగణపతి హోమం, విశేష నవకలశ పూర్ణాభిషేకం, పుష్పాభిషేకం, అర్చన, మహాహారతిని జరిపారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మురళీమోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అక్కెం మల్లికార్జునరెడ్డి, చంద్రప్రభ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు



రైతుకు చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ లైన్లు పంట పొలాల మీదుగా వెళ్లడంతో నష్టపోయిన రైతులకు ఆదివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పరిహారం చెక్కులను మంత్రి కాకాణి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నం–మనుబోలు 400 కేవీ విద్యుత్ లైన్ ఇంటర్లింకింగ్ వల్ల టవర్‌భూమి, పంట నష్టపోయిన నేలటూరు, పైనాపురం గ్రామాల్లోని 10 మంది రైతులకు విద్యుత్‌శాఖ ద్వారా మంజూరు అయిన రూ.10.38 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ లైన్ల మార్పు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా రైతులకు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. లోటల్టేజీ సమస్యలను కూడా అధిగమించేందుకు అవసరమైన చోట నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా విద్యుత్ లైన్ మార్చాల్సిన ప్రాంతాల్లో రైతులకు నష్టపరిహారం చెల్లించి నూతన లైన్ ఏర్పాటు చేసి సబ్‌స్టేషన్లకు అనుసంధానిస్తున్నామన్నారు. రైతులు, ప్రజల ప్రయోజనాలే ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌జేడబ్ల్యూ పాలిస్టిన్, డీఈ సుధీర్‌బాబు, నాయకులు పరిడి రామమోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత సంగమేశ్వర టీమ్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్సై అజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మనుబోలు సంగమేశ్వర జట్టు గెలుచుకుంది. మనుబోలు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మాజీ సర్పంచ్, దివంగత బొమ్మిరెడ్డి వెంకురెడ్డి, వనజాక్షమ్మ జ్ఞాపకార్థం వారి మనుమడు బొమ్మిరెడ్డి పార్థేశ్వరరెడ్డి నిర్వహించిన టోర్నీలో పలు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కాగా ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మనుబోలు మెయిన్ జట్టుపై సంగమేశ్వర జట్టు 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సంగమేశ్వర జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 66 పరుగులు చేయగా అనంతరం 66 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన మనుబోలు మెయిన్ జట్టు కేవలం 42 పరుగులకే ఆలౌట్ అయింది. విజేత సంగమేశ్వర జట్టుకు ఎస్సై అజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తదితరులు ట్రోఫీతో పాటు రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. అలాగే రన్నరప్ మెయిన్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచి పద్మమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీంధర్‌రెడ్డి, కంచి మణి, ఏలూరు భాస్కర్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్, ముంగర ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలుగులోకి మరిన్ని అక్రమాలు

కోవూరు: వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి అక్రమాల పర్వం ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. సూరా సొంత గ్రామమైన పంచేడులో ఉన్న గిరిజన కాలనీలో పొదుపు సంఘాల రుణాలను సైతం తీసుకుని గిరిజనులకు పైసా ఇవ్వకుండా సొంత ఖాతాలో నగదు జమ చేసుకున్నట్లు ఆ ప్రాంత వాసులు బోరున విలపిస్తున్నారు. కూలి పనులకు పోతేనే పొట్ట నింపుకునే దినసరి కూలీలు బ్యాంకు అధికారులకు సమాధానం చెప్పలేక కొందరు ఊరు వదలి వెళ్లిపోతున్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో కూడా సూరా అనేక అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. రైసు మిల్లర్లకు ధాన్యం తోలకుండానే ముందుగా రూ.కోట్లు తీసుకుని కాలయాపన చేశారని పలువురు రైస్ మిల్లర్లు గతంలో సివిల్‌సప్లయ్స్ అధికారుల ముందు వాపోయారు.

టీడీపీలోకి వద్దంటున్న బుచ్చి కేడర్

సూరా శ్రీనివాసులురెడ్డిని వైఎస్సార్‌సీపీ పక్కన పెట్టడంతో టీడీపీకి దగ్గరయ్యేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. అందులో భాగంగా పది రోజుల క్రితం హైదరాబాద్‌లో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. అక్కడి ఒప్పందం ప్రకారం మూడు రోజుల క్రితం వెంకటగిరిలో జరిగిన చంద్రబాబు బహిరంగ సభలో సూరా టీడీపీలో చేరాల్సి ఉంది. అయితే బుచ్చిరెడ్డిపాళెంలోని టీడీపీ నేతలు సూరా రాకను తీవ్రంగా వ్యతిరేకించారు. అతను టీడీపీలో చేరితే తామంతా బయటికి వచ్చేస్తామని తెగేసి చెప్పారు. దీంతో సూరా శీనయ్య టీడీపీలో చేరే ప్రక్రియకు బ్రేక్ పడింది.